విద్యుత్ తీగలతో చేపల వేట

- ఒకరి అరెస్ట్: ఎస్ఐ రమాకాంత్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు20: విద్యుత్ తీగలతో చేపలు పట్టిని ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వట్టెల రాజుకు చాకలి వాగు వద్ద వ్యవసాయ భూమి ఉన్నది. అక్కడ బోరుబావికి సంబంధించిన సర్వీస్ వైరు చోరీకి గురైంది. గొర్రెల కాపరి పెద్దవేని పరశురాములు సమాచారం మేరకు తన వైరు ఇవ్వాలని కుంచం పరశురాములును రాజు నిలదీయగా బెదిరింపులకు గురిచేశాడు. పరశురాములు తన సర్వీస్ వైరు తీసుకెళ్లి, అక్రమ విద్యుత్ కనెక్షన్ ద్వారా చేపలు పడుతున్నాడని రాజు తాణాలో ఫిర్యాదు చేశాడు. పరశురాములును అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

22న చలో కలెక్టరేట్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణలో క్రిమిలేయర్ పేరుతో ఎస్సీల హక్కుగా ఉన్న రిజర్వేషన్లు రద్దు చేసే బీజేపీ కుట్రలకు నిరసనగా ఈనెల 22న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు పిలుపునిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ జాతీయ కార్యదర్శి రాగుల రాములు, దళిత సంఘాల నేతలు, తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వీర్నపల్లి, ఆగస్టు20: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ బ్రీడింగ్ చెక్కర్ గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం బంజేరులో డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ చైతన్యతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో దోమల స్ప్రే, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేసినట్లు తెలిపారు. ఇక్కడ ఏఎన్ఎంలు కీర్తి, సుజాత, పంచాయతీ కార్యదర్శి రణధీర్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కోనరావుపేట, ఆగస్టు 20: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు వెంకటేశ్ సూచించారు. సుద్దాలలో డ్రైడే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేసి, అవసరం ఉన్నవారికి మందులు అందజేశారు. ఇక్కడ ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్తలు జమున, పద్మ, సీసీ శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులపై దృష్టిసారించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- అధికారులతో సమీక్ష

కలెక్టరేట్: సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, ఆగస్టు 20: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్ఆర్ఎస్. దరఖాస్తులు, చేపట్టాల్సిన చర్యలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్‌కు మొత్తం 42,941 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తుల స్క్రూటీని చేసే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఎల్ఆర్ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసే విధానం, వివరాల నమోదుపై వివరించారు. దరఖాస్తుల స్క్రూటినీ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వారు వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి వనరులు, కాలువలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాలని సూచించారు. కలెక్టరేట్, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్క్‌లు, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీటీసీపీవో అన్సారీ, డీపీవో వీరబుచ్చయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు

ఎల్ఆర్ఎస్, భారీ వర్షాలు, ధరణి పోర్టల్, ఆర్ ఓఆర్ చట్టంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరయ్యారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని, మార్గదర్శకాల ప్రకారం స్క్రూటినీ త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని మంత్రి సూచించారు. అలాగే భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు మెరుగైన ఆదాయం

మంచి మార్కెటింగ్ ద్వారా జిల్లాలోని మత్స్యకారులకు మెరుగైన ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ దావ్వారా జిల్లాను అక్వాహబ్‌గా అభివృద్ధి చేయాలని అధికారులను దేశించారు. మంగళవారం కలెక్టర్ సమీకృత కలెక్టరేట్‌లో వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్‌పై సంబంధిత అధికారులతో సమావేశమై, మాట్లాడారు. పీఎంఎఫ్ఎంఈలో భాగంగా ప్రతి జిల్లా నుంచి అక్కడి పరిస్థితులు, మార్కెటింగ్ అవకాశాలు, పర్యావరణం, కామన్ సర్వీసెస్ వినియోగానికి దృష్టిలో ఉంచుకొని ఒక ప్రొడక్ట్ ఎంపిక చేసి దాని ఎగుమతికి, మెరుగైన మార్కెట్ కల్పనకు వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ కింద కృషి చేస్తామన్నారు. జిల్లాలో చేపల ఎగుమతి చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, జిల్లాలో ఉన్న 300ఎకరాల భూమి, 450 చెరువులలో చేపల ఉత్పత్తి చేసి.. మార్కెట్ డిమాండ్ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, జీఎం ఇండస్ట్రీస్ భారతి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఎల్డీఎం మల్లికార్జున్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం ప్రెసిడెంట్ రామచంద్రం పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

కోనరావుపేట, ఆగస్టు 20: విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి మెరుగైన విద్యనందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మర్రనపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల రిజిస్టర్‌తోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

కోనరావుపేట: మర్రనపేటలో చిన్నారులు విద్యనభ్యసిస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

ఫ్యాన్లు తిరుగుతలేవ్..

- దోమలు కుడుతున్నయ్
- బాత్‌రూమ్‌లు కంపుకొడుతున్నయ్
- జిల్లా దవాఖానలో ఓ మహిళ ఆవేదన

జిల్లా దవాఖానలోని ప్రసూతి గదిలో బాత్‌రూమ్ పరిసరాలను చూపిస్తున్న మహిళ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20: ఫ్యాన్లు తిరుగతలేవు.. బాత్‌రూమ్‌లు కంపు కొడుతున్నయ్.. దోమలు కుట్టి రోగాలు వస్తే ఎవరది బాధ్యత.. మమ్మల్ని మంచిగ చూసుకునే బాధ్యత డాక్టర్లకు లేదా.. అంటూ ఓ మహిళ ప్ర భుత్వ దవాఖానలో సౌకర్యాల దుస్థితిపై ప్రశ్నించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా దవాఖానలో ఓ పేషెంట్ బంధువు ప్రసూతి వార్డులోని దుస్థితిపై మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రభుత్వ దవాఖానలో బాగుంటుందని తల్లీబిడ్డ ఇద్దరూ బాగుండాలని ఇక్కడికి వచ్చినం. ఇక్కడ చూస్తే ఫ్యాన్లు తిరుగతలేవు.. దోమలు కుడుతున్నయ్.. ఉక్కపోత భరించలేకపోతున్నం.. దోమలు కుట్టి డెంగ్యూ జ్వరాలు వస్తే ఎలా? బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయి.. ఆపరేషన్ అయిన బాలింతలు బాత్‌రూమ్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందిఉన్నది. సార్లు పట్టించుకొని ఫ్యాన్లు పెట్టియ్యాలే, బాత్‌రూ మ్‌లు మంచిగజెయ్యాలే అంటూ ఆవేదన వ్యక్తం చేసింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 37వ వార్డులో గల ప్రధాన మురుగు కాలువను పరిశీలించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ దిడ్డి రాజు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఆగస్టు 20: తహసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ఆర్డీవోలకు వెంటనే పంపించి.. రెండు రోజుల్లోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 763దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఎల్లారెడ్డిపేటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: కోల్‌కతాలో మెడికోపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు పాఠశాలు, కళాశాలల విద్యార్థులు బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రహదారిపై ర్యాలీ, తీసిపాత బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. ఇక్కడ తెవిరసం అధ్యక్షుడు పరశురాములు, బీజేవైఎం నేత కుమార్ ఉన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా చైతన్య

ఏఎంసీ పాలకవర్గానికి నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ఆగస్టు 20: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అనంతగిరికి చెందిన ఐరెడ్డి చైతన్య, వైస్ చైర్మన్‌గా వల్లంపట్లకు చెందిన ఎలగందుల ప్రసాద్ నియామకం అయ్యారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాలకవర్గ కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. ఇందుకు సహకారం అందించిన ఎమ్మెల్యే, మండల నాయకులకు ఏఎంసీ పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కలప అక్రమ రవాణాపై సీరియస్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: పోతిరెడ్డిపల్లి శివారులోని కడపరాయి గుట్టల్లో 'యథేచ్ఛగా చెట్ల నరికివేత' శీర్షికన ఈ నెల 19న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి డీఆర్వో మోహన్‌లాల్ స్పందించారు. ఈ మేరకు మంగళవారం సిబ్బందితో కలిసి పోతిరెడ్డిపల్లి, దుమాల, అక్కపల్లి శివారులోని కడపరాయి గుట్ట సరిహద్దు అటవీ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. టేకు చెట్లను నరికివేసిన బాధ్యులపై చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. అలాగే పోతిరెడ్డిపల్లి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎవరైనా కలప అక్రమ రవాణా చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఇక్కడ బీట్ ఆఫీసర్ అనూష ఉన్నారు.

ఏఈవోకు సన్మానం

వేములవాడ రూరల్, ఆగస్టు 20: హన్మాజీపేట క్లస్టర్ ఏఈవోగా విధులు నిర్వర్తించి సందీప్ బదిలీపై వెళ్తున్న సందీప్‌ను స్నేహ యూత్ సభ్యులు, రైతులు మంగళవారం రైతు వేదికలో సన్మానించారు. అలాగే బదిలీపై వచ్చిన నూతన ఏఈవో దీపికను సత్కరించారు. ఇక్కడ మాజీ ప్రజాప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, మధు, అంజి, మల్లేశం, అంజి, తిరుపతిరెడ్డి, స్నేహ యూత్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

గుంత పూడ్చిన చిన్నారి

రోడ్డుపై గుంతను పూడ్చుతున్న చిన్నారి మరిపెల్లి భాని

రుద్రంగి, ఆగస్టు 20: రుద్రంగి శివారులోని కోరుట్ల–వేములవాడ ప్రధాన రాహదారిపై కలిగోటతండా ప్రాంతంలో గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రుద్రంగికి చెందిన చిన్నారి మరిపెల్లి భాని కుటుంబ సభ్యులు అటు వైపు వెళ్లింది. రోడ్డుపై గుంతలు కనిపించడంతో వారి వాహనాన్ని ఆపి మట్టితో గుంతలను పూడ్చింది. గుంతను పూడ్చిన చిన్నారి భానిని ప్రయాణికులు అభినందించారు.

నేతన్నలకు ఉపాధి కల్పించండి

కలెక్టరేట్, ఆగస్టు 20: టెక్స్‌టైల్ పార్క్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మూషం రమేశ్, కోడం రమణ మంగళవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కార్యాలయంలో టెస్కో జీఎం అశోక్‌రావు, ఏడీ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఉపాధి కల్పించాలని, బతుకమ్మ చీరలకు సంబంధించి పెండింగ్ బిల్లులు, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఇక్కడ సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

స్తంభంపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, ఆగస్టు 20: గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం ఆయన తడగొండలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత స్తంభంపల్లిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ (గుండన్నపల్లి) రవీందర్‌రావు స్మారకార్థం పాఠశాలకు బెంచీలు వితరణ చేసిన కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ జోగినపల్లి వెంకట్రామరావు, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు ఉన్నారు.

గంజాయిని నిర్మూలిద్దాం: ఎస్పీ

సిరిసిల్ల రూరల్: మాట్లాడుతున్న ఎస్ఐ సుధాకర్

తెలంగాణ చౌక్, ఆగస్టు 20: గంజాయి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణాను ఆరికట్టడానికి ప్రత్యేక డైవ్‌లు నిర్వహిస్తూ, నార్కోటిక్ జాగిలలతో తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే గంజాయి సేవిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఎవరైనా గంజాయి సాగు చేసినా.. సేవించినా.. విక్రయించినట్టు తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, 87126–56392 నంబర్‌కి గానీ కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదాం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడుదామని ఎస్ఐ డీ సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తంగళ్లపల్లి మండలంపై డ్రగ్స్ నిర్మూలనపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయించినా, సాగు చేసినా, సేవించినట్లు తెలిస్తే వెంటనే నంబర్‌కు (87126 56392) సమాచారం ఇవ్వాలన్నారు. ఇక్కడ డాగ్ స్క్వాడ్ సిబ్బంది కార్తీక్, అబ్బాస్, నరేందర్, తదితరులు ఉన్నారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల్లో గంజాయి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి సాగు చేసినా.. విక్రయించినా.. సేవించినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

- ముస్తాబాద్‌లో పోస్ట్‌కార్డులతో సీఎంకు వినతి

పోస్ట్‌కార్డులతో సీఎంకు వినతి చేస్తున్న సంఘం నాయకులు

ముస్తాబాద్, ఆగస్టు 20: విద్యార్థుల సౌకర్యార్థం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని శాలీవాహన సంఘం నాయకులు మంగళవారం పోస్ట్‌కార్డుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో శాలీవాహన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇక్కడ సామాజిక కార్యకర్త చింతోజి బాలయ్య, సంఘం నాయకులు అంజయ్య, దేవయ్య, రాములు, వెంకటేశం, రామచంద్రం, కాశయ్య ఉన్నారు.

రాజన్న సన్నిధిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్

స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 21: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలుకగా, చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ ఆలయ ప్రాంగణంలో మాట్లాడుతూ, రాజన్నను ఏటా శ్రావణ మాసంలో దర్శించుకుంటానని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్టు ఆమె తెలిపారు.

బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

ఆలయం ముందు భాగంలో భక్తులు

వేములవాడ టౌన్, ఆగస్టు 20: బద్ది పోచమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ పురవీధులగుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యే క పూజలు చేశారు. అమ్మవారికి కల్లు పోసి.. సారెపెట్టి బోనాలు సమర్పించారు.

రాజీవ్‌గాంధీ జయంతి

రాజన్న సిరిసిల్ల నెట్‌వర్క్, ఆగస్టు 20: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల కేక్‌లు కట్‌చేసి, స్వీట్లు పంచిపెట్టారు.

బంద్‌ను విజయవంతం చేద్దాం

- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం
- ఎస్సీ వర్గీకరణను ఖండిస్తూ పలుచోట్ల నిరసనలు

గంభీరావుపేట: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు నేతలు

గంభీరావుపేట, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం చేపట్టే బంద్‌ను విజయవంతం చేద్దామని జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వర్గీకరణను ఖండిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్, మాజీ సర్పంచ్ ఎడబోయిన రాజు, మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, మండలాధ్యక్షుడు బాబు, నాయకులు గొర్రె కిశోర్, దోసల శంకర్, ఎగదండి రవి, ధన్‌రాజ్, జెల్ల భూదయ్య, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

చందుర్తి, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం మండల కేంద్రంలో మాల మహానాడు నేతలు నిరసన చేపట్టారు. ఇక్కడ మండలాధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సిరిగిరి సుధాకర్, మాల ఐక్య వేదిక మండల బాధ్యులు బత్తుల ఉదయ్‌కుమార్, సంటి నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కమలాకర్, నాయకులు సంటి ప్రసాద్, నీరటి ప్రసాద్, రాగుల సుబ్రహ్మణ్యం, గొంటి తిరుపతి, పు రుగుల సతీశ్, కాపిల్ల రమేశ్, ఈసరి రవి, యాస అంజయ్య, స్వామి, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20: మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం (మాల) సమావేశ మందిరంలో నాయకులు సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేక చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్ బంద్‌కు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఇక్కడ సంఘం నాయకులు రొడ్డ రామచంద్రం, ఎడ్ల సందీప్, రాజ్‌కుమార్, లింగాల దాసు, రేసు శంకర్, గడ్డం జితేందర్, తదితరులు ఉన్నారు.

అవగాహన ర్యాలీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు20: మలేరియా నిర్మూలనలో భాగంగా మంగళవారం బొప్పాపూర్‌లోని వీధుల్లో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ తీశారు. వానకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇక్కడ వైద్యాధికారులు స్రవంతి, చిరంజీవి ఉన్నారు.

ఒకరి బలవన్మరణం

ముస్తాబాద్, ఆగస్టు 20: మండల కేంద్రానికి చెందిన వేముల మల్లేశం (40) కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గతంలో మూడుసార్లు గల్ఫ్ వెళ్లగా, అక్కడ సరైన ఉపాధి లేక తిరిగివచ్చాడు. చేసిన అప్పు తీర్చేమార్గం లేక మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ హక్కుల కోసం ముందుండాలి

వాల్ పోస్టర్‌ను